క్లుప్తంగా

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత



రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న అధికారులు

సైదాపురం: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలంలో జోరుగా సాగుతోంది. స్థానిక గ్రామ సచివాలయంలో లబ్ధిదారుల వేలిముద్రలు నమోదు చేసి ఇళ్ల స్థలాలను వారి పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. శుక్రవారం సైదాపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి శౌఇంద్రాణి, వీఆర్వో హైమావతి ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ సిద్దయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 10.902 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 10.902 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 280 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హై లెవలల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 360 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష

సైదాపురం : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై శుక్రవారం ఎంపీడీవో సుధాకర్ మహిళా పోలీసులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంతోపాటు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో పురుషోత్తం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

100 రోజులు పని పూర్తి చేసుకోండి

చిల్లకూరు : ఉపాధి హామీ కూలీలు మార్చి నెలాఖరులోగా 100 రోజుల పని దినాలను పూర్తి చేసుకోవాలని ఏపీవో గిరిబాబు కోరారు. మండలంలోని తిమ్మనగారిపాళెంలో శుక్రవారం ఉపాధి కూలీలతో రోజ్‌గార్ దినం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో సుమారు 150 మంది కూలీలు పనులకు వస్తున్నారని తెలిపారు. వారిలో 100 మంది వరకు 100 రోజులు పని పూర్తి చేయలేదన్నారు. మార్చి నెలాఖరులోగా పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

జగనన్నతోనే బీసీలకు సముచిత స్థానం

దక్కిలి: జగనన్నతోనే బీసీలకు సముచిత స్థానం లభించిందని వైఎస్సార్ సీపీ నాయకుడు డీపీ యాదవ్ తెలిపారు. ఆయన శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు అన్ని రంగాల్లోనూ 50 శాతం రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా బీసీలకు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఏకమై వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వి.చెంచయ్య, డి.వడ్డిపల్లి ఎంపీటీసీ ఎస్.చెంచయ్య, ఆంజనేయులు, సర్వేపల్లి రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

చిల్లకూరు : ప్రతి కుటుంబానికీ ఆరోగ్యశ్రీ కార్డులను త్వరితగతిన అందజేయాలని ఎంపీడీవో భానుమూర్తిరావు ఆదేశించారు. ఆయన శుక్రవారం పంచాయతీల కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం సాయంత్రానికి పూర్తి చేసి నివేదికలను సోమవారం కలెక్టర్‌కు అందజేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రతి సచివాలయానికీ ఒక డీడీవో ఉండాల్సి ఉందన్నారు. నాలుగు సచివాలయాలకు ఒకరిని ఇన్‌చార్జ్‌లుగా నియమించడంతో ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీవో తెలిపారు. ఈవోపీఆర్డీ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కోట: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పేదలకు వరమని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చిట్టేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. కోట–1 సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు నాగరాజు, మునిశేఖర్‌రెడ్డి, డీపీ ప్రసాద్ 201 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మరో 54 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వలంటీర్ వాకాటి అనితకు సేవ వజ్ర అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే





వలంటీర్ల సేవలు ఎనలేనివి

ఓజిలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేయడంలో వలంటీర్ల సేవలు ఎనలేనివని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఎంపీడీవో కార్యాల య ఆవరణలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారని పేర్కొన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించి అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. వెంకటరెడ్డిపాళెం సచివాలయం వాకాటివారికండ్రిగకు చెందిన వాకాటి అనితకు సేవా వజ్ర, యనమల గురవయ్య, తిరగాబత్తిన గురవయ్య, పులగూర ప్రతాప్, కొండా మధు, పుట్టాం సునీతకు సేవారత్న అవార్డులు అందజేశారు. వలంటీర్లు కష్టపడి పనిచేసి రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అరుణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ హరనాథ్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ప్రవీణ, కుందాం పీఏసీఎస్ అధ్యక్షులు రాజారామిరెడ్డి, నాయకులు వెంకటసుబ్బరాజు, మధుసూదన్‌రెడ్డి, సుబ్బరావుయాదవ్, బట్టా అనీల్‌కుమార్ యాదవ్, ఖాదర్‌బాషా, సురేష్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు పాల్గొన్నారు.

మళ్లీ మంచి జరగాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలి

నాయుడుపేట టౌన్ : ప్రతి పేద కుటుంబానికీ మంచి జరగాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు. నాయుడు పేట పట్టణంలోని కేకే కల్యాణ్ సదన్‌లో శుక్రవారం సాయంత్రం నాయుడుపేట, రూరల్, అర్బన్ పరిధిలోని వలంటీర్లకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు ఇంటి వద్దకే అందించాలన్న ఉద్దేశంతో సీఎం జగనన్న వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. వలంటీర్లను అవహేళన చేసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ప్రజలను చైతన్యం చేసి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మీ, జేసీఎస్ కన్వీనర్లు సీహెచ్ కుమార్, కిషోర్ యాదవ్, బి.మల్లికార్జునరెడ్డి, కె.జయరామ య్య, కె.చెంచయ్య, డి.రవి, రత్నశ్రీ, పి.నాగార్జున, వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజా మొహిద్దీన్ పాల్గొన్నారు.



వలంటీర్‌కు సేవా రత్న అవార్డు అందించి సత్కరిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నేడు వలంటీర్లకు సన్మానం

పెళ్లకూరు: మండలంలోని గ్రామ వలంటీర్లకు శనివారం చాగణం ట్రస్ట్ ప్రాంగణంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పురస్కారాలు అందజేస్తారని ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

దొరవారిసత్రం : మండలంలో సేవలందించిన వలంటీర్లకు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించనున్నట్టు ఇన్‌చార్జ్ ఎంపీడీవో రఘురామయ్య తెలిపారు. వలంటీర్లు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి మున్సిపాలిటీలో పనిచేస్తున్న వార్డు వలంటీర్లకు శనివారం స్థానిక నేదురుమల్లి నివాసంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

ఎన్నికల్లో సమష్టిగా పనిచేయాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, రాజ్యలక్ష్మి

వెంకటగిరి రూరల్ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె శుక్రవారం వెంకటగిరిలోని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆమె మాట్లాడుతూ దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి నియోజకవర్గానికి విశేష సేవలు అందించారని తెలిపారు. ప్రస్తుత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేసి జగన్‌ను మరోసారి సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం జగనన్నకు బహుమతిగా ఇద్దామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు కోరారు. వారు శుక్రవారం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన నేదురుమల్లి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

నేదురుమల్లిని కలిసిన తహసీల్దార్

బాలాయపల్లి తహసీల్దార్ కె.పుల్లారావు శుక్రవారం వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

పార్టీ గెలుపుకోసం కలసికట్టుగా పనిచేయాలి

బాలాయపల్లి(డక్కిలి): వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం బాలాయపల్లి మండలం జయంపు గ్రామానికి చేరుకుని కంటి సమస్యతో బాధపడుతున్న వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ శింగొట్టి భాస్కర్‌రావును పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డితో కాసేపు మాట్లాడారు. నాయకుల మధ్య ఉన్న అభిప్రాయ భేదాలను విడనాడి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఇందులో భాగంగా మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రామానికి విచ్చేసిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు.

జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందాం



నాయకులతో మేరిగ మురళీధర్

గూడూరు రూరల్ : రాష్ట్రంలో పేదలు ఆర్థికంగా ఎదగాలంటే మరోసారి సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం పురుటిపాళెం, పోటుపాళెం, తిమ్మసముద్రం గ్రామాల్లో పర్యటించారు. నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. ఎంతో మందికి మేలు జరిగిందన్నారు. చేసిన మేలును గుర్తించి వైఎస్సార్ సీపీకి ఓటు వేసేలా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఎంపీపీ గురవయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, 24 సొసైటీ అధ్యక్షుడు అట్ల శ్రీనివాసులురెడ్డి, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, నాయకులు చేవూరు విజయమోహన్‌రెడ్డి, ఫణీంద్రరెడ్డి, దయాకర్, మనుబోలు క్రిష్ణయ్య, కుందకూరు సర్పంచ్ శీనయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

కోట: నిబంధనలు పాటించని దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఖాళీ చేయని బజారు వీధిలోని దుకాణాలకు అధికారులు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. టెండర్ల ప్రక్రియ కొనసాగించేందుకు కొందరు దుకాణదారులను వెంటనే ఖాళీ చేయాలని ఇటీవల నోటీసులు జారీ చేశారు. దుకాణదారులు ఖాళీ చేయకపోవడంతో చర్యలు తీసుకున్నట్టు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



గూడూరు రూరల్ : శ్రీకృష్ణ దేవరాయలు జయంతి సందర్భంగా పట్టణంలోని సంగం థియేటర్ కూడలి వద్ద శుక్రవారం హీరాబెన్ మాతాజీ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కాపునాడు కార్యదర్శి కంకణాల పెంచలనాయుడు మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాష ఔన్నత్యాన్ని కొనియాడిన మహనీయుడు శ్రీకృష్ణదేవరాయలు అని పేర్కొన్నారు. తెలుగు భాష అభివృద్ధికి ఆయన చేసిన కృషి అనిర్వచనీయమన్నారు.

తోట కృష్ణయ్యపై మహిళల ఆగ్రహం

వెంకటగిరి రూరల్ : కాపు బలిజ సంక్షేమ సేవా సంఘం వెంకటగిరి అధ్యక్షుడు తోట కృష్ణయ్యపై స్థానిక జనసేన మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంకటగిరి జనసేన ప్రధాన నేతకు సంబంధించి మహిళలపై ఓ యూట్యూబర్‌తో అసభ్యకరంగా మాట్లాడారన్న వాయిస్ రికార్డింగ్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత మహిళలు ఆగ్రహానికి గురై శుక్రవారం తోట కృష్ణయ్య నివాసానికి చేరుకుని మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడడం సమంజసం కాదని నిలదీశారు. స్పందించిన కృష్ణయ్య మాట్లాడుతూ ఆ వాయిస్ రికార్డింగ్ తనది కాదనీ, తాను ఎవరితోనూ ఏమీ మాట్లాడలేదని వారికి బదులు ఇచ్చారు.



తోట కృష్ణయ్యను ప్రశ్నిస్తున్న మహిళలు

బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలి

తడ: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సయ్యద్ ఇస్మాయిల్ హెచ్చరించారు. ఆయన శుక్రవారం బీఎల్‌లతో సమావేశమయ్యారు. ఓటరు జాబితా తయారీ, ఆన్‌లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తుల పరిశీలన, చనిపోయిన, వలస వెళ్లిన వారి పేర్లు తొలగింపు తదితరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎంఈవో మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తులను నిల్వ చేయడంపై శిక్షణ



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో మందారాణి

రాపూరు: అటవీ ఉత్పత్తులను నిల్వ చేయడంపై గిరిజనులకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుందని ఐటీడీఏ పీవో మందారాణి తెలిపారు. ఆమె శుక్రవారం రాపూరులోని వెలుగు కార్యాలయంలో వందన్ వికాస్ సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ మండలంలో వందన్ వికాస్ కేంద్రంలో ఉన్న 15 గ్రూపుల్లో 275 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. వారు తేనె, ఉసిరి, మారెడు గడ్డ తదితర అటవీ ఫలాలను సేకరించి జీవనాధి పొందుతున్నారని తెలిపారు. వాటిని ఎక్కువ కాలం నిల్వ చేయడంపై ప్రత్యేక శిక్షణ, వస్తువులు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గిరిజనులు అడవుల్లోకి వెళ్లినప్పుడు అటవీ శాఖ అధికారులు అడ్డుకోకుండా గుర్తింపు కార్డులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన కార్పొరేషన్ మేనేజర్ రమణారెడ్డి, డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసులు, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ జయరామయ్య, ఏపీఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

గూడూరు రూరల్: పిల్లలకు విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గోగినేనిపురం వద్ద ఉన్న ఆదిశంకర పాఠశాలలో శుక్రవారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. సీఐ వేణుగోపాల్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడడం వల్ల విద్యార్థుల్లో మానసిక, శారీర ఉల్లాసం పెరుగుతుందన్నారు. నేటి సమాజంలో పిల్లలు ఎక్కువగా టీవీలు, సెల్‌ఫోన్‌లకు సమయం కేటాయిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, ప్రిన్సిపాల్ రూపవతి, మల్లికార్జున్ పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

18న సిరామిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలో ఉన్న గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిరామిక్ టెక్నాలజీ(జీఐసీటీ) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. కళాశాలలో శుక్రవారం అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1956లో సిరామిక్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, 1986లో అటానమస్ కళాశాలగా మారిందన్నారు. అల్యూమిని అసోసియేషన్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు సంఘంగా ఏర్పడి కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారన్నారు. డార్మెటరీ, టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి రూ.20 లక్షలు అందజేసినట్టు తెలిపారు. ఈ ఏడాది సమావేశానికి సుమారు 600 మంది కళాశాల పూర్వవిద్యార్థులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపాల్ సుబ్బారావు, అల్యూమిని అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, ట్రెజరర్ పాండు నాయుడు, నరసింహులు, గుండు సుబ్రమణ్యం, అరుణ్‌కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

వెంకన్న ఆలయంలో చోరీ

తడ: మండలంలోని అండగుండాలలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీలోని నగదు, సౌండ్ సిస్టంతోపాటు ఇన్వర్టర్ చోరీ చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. హుండీలో సుమారు రూ.50 వేల వరకు కానుకలు ఉండవచ్చని చెబుతున్నారు. ఎస్ఐ నరసింహారావు గ్రామానికి వెళ్లి విచారించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

దొరవారిసత్రం : మండలంలోని మైలాంగం, ఏకొల్లు, ఎగువమేలుపాక, మావిళ్లపాడు, పోలిరెడ్డిపాళెం పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సీఐ జగన్‌మోహన్ రావు, ఎస్ఐ తిరుమలరావు తనిఖీ చేశారు. వసతుల గురించి ఆరా తీశారు. స్థానికులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఘర్షణలు, వివాదాల జోలికి పోకుండా ఉండాలని సూచించారు.

వామపక్ష నేతల నిరసన

సైదాపురం : రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసనగా శుక్రవారం సైదాపురంలో భారత్ బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆస్పత్రి కూడలి నుంచి ర్యాలీగా బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో చెంగల్‌రావు, వెంకటయ్య, శ్రీను, వెంకటరమణ, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు: ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ వెలిగిపోతుందని అనడం సబబు కాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకవి ముకుంద తెలిపారు. ఆయన శుక్రవారం ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ ఆయాలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

గూడూరు రూరల్‌లో..


గూడూరు రూరల్ : గూడూరులో శుక్రవారం నిర్వహించిన బంద్ విజయవంతమైందని వామపక్షాల నేతలు తెలిపారు. వారు స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఏవోకు వినతి పత్రం అందజేశారు.

వెంకటగిరిలో..

సైదాపురం (వెంకటగిరి) : వామపక్ష నేతలు శుక్రవారం వెంకటగిరి పట్టణంలో నిరసన తెలిపారు. వారు ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాజావీధి, పాతబస్టాండ్, తూర్పువీధి మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ చేశారు.

సప్త వాహనాలపై ఊరేగిన లక్ష్మీనరసింహుడు





సూర్యప్రభవాహనంపై ఊరేగుతున్న నరసింహస్వామి, శేషవాహనంపై స్వామి, అమ్మవార్లు

- గోవిందనామ స్మరణతో మారుమోగిన పెంచలకోన
- ఘనంగా రథసప్తమి వేడుకలు

రాపూరు : మండలంలో పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి శుక్రవారం ఏడు వాహనాలపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. పెంచలకోనలో రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి ఉదయం 6 గంటలకు సూర్యప్రభ వాహనంపై కొలువై భక్తులను అనుగ్రహించారు. 8 గంటలకు ఆదిలక్ష్మి దేవి, చెంచులక్ష్మి దేవితో కలిసి శేష వాహనంపై ఊరేగారు. 10 గంటలకు సింహ వాహనం, 12 గంటలకు గరుడ వాహనం ఊరేగుతూ భక్తులను కనికరించారు. మధ్యాహ్నం 2 గంటలకు సుదర్శన చక్రానికి పుష్కరిణి వద్ద చక్రస్నానం చేశారు. సాయంత్రం 4 గంటలకు స్వామి వారు బంగారు హనుమంత వాహనం, 6 గంటలకు అశ్వవాహనం, రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనంపై ఊరేగారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఘనంగా రథ సప్తమి వేడుకలు

తడ: మండలంలోని మాంబట్టులో వెలసిన గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ వైద్యులు కారణి మును స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉభయ దాతలుగా తిరుమూరు సుధాకర్‌రెడ్డి, సుజాతమ్మ దంపతులు వ్యవహరించారు. కోటపోలూరు గ్రామ శివాలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, అన్నపూర్ణ అన్నదాన ట్రస్టు చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య, గ్రామ పెద్దలు మల్లికార్జున్‌రెడ్డి, నందారెడ్డి, పురుషోత్తం, భాస్కర్, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

గూడూరు రూరల్‌లో

గూడూరు రూరల్ : రథ సప్తమి సందర్భంగా గూడూరులోని అళఘనాథ స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారు ఏడు వాహనాలపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

సైదాపురంలో..

సైదాపురం : రథసప్తమి సందర్భంగా మండలంలోని కృష్ణారెడ్డిపల్లిలో వైకుంఠపురంలో శ్రీమహావిష్ణువు ఉత్సవమూర్తిని శుక్రవారం గజ వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో అత్యంత వైభవంగా ఊరేగించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.